క్లుప్తంగా

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న వీరభద్ర చారి

పెంచికల్‌పేట్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతీ పల్లెలో వేగవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ వీరభద్ర చారి అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, జునుగరి మధుకర్, సమీర్ గుప్తా, రాజేశ్వర్, నగేశ్, శ్రీనివాస్, భుజంగ రావు, ప్రభాకర్, సంతోష్ పాల్గొన్నారు.

రుణమాఫీ ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీవిద్య

పెంచికల్‌పేట్: రుణమాఫీ కానీ రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని పెంచికల్‌పేట్ ఏఈవో శ్రీవిద్య అన్నారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో శనివారం రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రుణమాఫీ కానీ రైతులు సంబంధిత పత్రాలను రైతు వేదికలో అందిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు.

నేటి నుంచి స్వచ్ఛత పక్షోత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహించాలని డీఈవో అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 15 వరకు ప్రతీ పాఠశాలలో తప్పనిసరిగా స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలన్నారు. స్వచ్ఛత శపథం, పరిశుభ్రతపై అవగాహన, విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాస రచన పోటీలు, మొక్కలు నాటడం కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన ఉపాసె పెంటు ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోవడంతో శనివారం సిర్పూర్(టి) మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబానికి తమ వంతుగా సాయం చేసినట్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పైడి సంతోష్, అబ్దుల్ జమీల్, సయ్యద్ నాజిర్ అలీ, ధనుంజయ్, నీరటి శ్రీధర్, ఎర్ర రాజశేఖర్, కబీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సమీక్ష సమావేశం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసిన నేపథ్యంలో అత్యవసరంగా మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య, చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా సూచించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో టోల్ నెంబర్ 94920 83936, 94409 26876లను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్ అహ్మద్, కౌన్సిలర్ వనమాల రాము, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

కాగజ్‌నగర్ రూరల్: సీనియర్ సిటీజన్‌ల సంక్షేమ చట్టం 2007పై అధికారులు, సామాజిక కార్యకర్తలు, సీనియర్ సిటీజన్లు, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సీనియర్ సిటీజన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో నాయకులు ఏఎస్ఆర్ మూర్తి, రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్, చిలుక లక్ష్మినారాయణ, పురుషోత్తం పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

కాగజ్‌నగర్ రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను కనిపెట్టి శనివారం ఎస్సై రామన్‌కుమార్ బాధితులకు అందజేశారు. నామానగర్‌కు చెందిన పవన్, అందవెల్లి గ్రామానికి చెందిన కిరణ్‌లు ఇటీవల మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకుని సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో ఫోన్లను గుర్తించి అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

సిర్పూర్(టి): సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టరు వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతి, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిల గదులు వినియోగించవద్దు

సాక్షి ఎఫెక్ట్..



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కౌటాల: కౌటాల తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. ఆగస్టు 26న 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన 'శిథిల భవనాలు' కథనానికి ఆయన స్పందించా రు. ఈ సందర్భంగా కౌటాల తహసీల్దార్ కా ర్యాలయాన్ని సందర్శించి భవన పరిస్థితిని పరిశీలించారు. స్లాబ్, గోడల నుంచి వర్షపు నీరు రావడంతో ఆ గదులను వినియోగించవద్దన్నారు. తాత్కాలికంగా గదులకు రూఫ్ మీద బేరింగ్ కోట్, కెమికల్ వేసి లీకేజీ కాకుండా ఉండేందుకు ప్రణాళిక రూపొందించి నివేదిక అందించాలని పంచాయతీరాజ్ ఏఈ మక్బుల్ హుస్సేన్‌ను ఆదేశించారు. అ లాగే కౌటాల ఎంపీడీవో కోట ప్రసాద్ ఎంపీడీవో కార్యాలయ భవనం సైతం వర్షాలకు ఊరుస్తోందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులు చేయాలని అధి కారులను ఆదేశించారు. వెంట తహసీ ల్దార్ పుష్పాలత, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీవో మహేందర్, కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకుడు

కెరమెరి: మండలంలోని చిన్నకొండగుట్ట ఆంజనేయ ఆలయంలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్‌కు చెందిన మాడుగుల నారాయణమూర్తి, మధూకర్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన, అఖండ దీపారాధన, కలశ గణపతి, నవగ్రహా, వాస్తదోశ, మోగిని, ఆంజనేయ స్వామి, జలాదివాసము, ధాన్యాదివాసము, అగ్ని ఉచ్చారణ, ధ్వజస్తంభ, శిఖర కలశ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవతా మూర్తులకు అభిషేకం, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు వివిద ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు ఉన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

లింగాపూర్: ప్రజలు వ్యాధ్యులపై అప్రమత్తంగా ఉండాలని ఆసుపత్రి సూపర్‌వైజర్ దత్తారం అన్నారు. శనివారం మండలంలోని జాముల్‌ధరా, కన్నేపల్లి గ్రామాల్లో శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సంధ్యారాణి, ఆశ వర్కర్ రాధాబాయి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు వినోద్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని మోవాడ్, బలంపూర్, చింతగూడ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కీర్తి, నజమస్, సరిత, భీంరావు, ఆశ రాధ పాల్గొన్నారు.

'ఆయూష్' వైద్య శిబిరం..

కెరమెరి: మండల కేంద్రంలోని ఆయూష్ వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 50 ఏళ్లకుపై బడిన వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, మోకాళ్ల నొప్పిలకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయూష్ అందిస్తున్న సేవలు, వైద్యానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి సందీప్, వైద్యాధికారి సుజాత, ఫార్మసిస్ట్ లక్ష్మి, సిబ్బంది మోతిరాం, శ్రీలత, ఇందిరా పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాత



మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో శని వారం పోలీసుల ఆధ్వర్యంలో పో లీస్ జాగృతి కళాబృందం వారిచే కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మోసాలు గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో పాటు బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ చర్యలు, చదువు ప్రాముఖ్యత, చెడు అలవాట్లు, మంచి అలవాట్లు, మహిళా భద్రత గురించి వివరించారు. అనంతరం ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

తిర్యాణి: మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని తుడుందెబ్బ జిల్లా కోఆర్డినేటర్ గేడం సుభాశ్ డిమాండ్ చేశారు. శనివారం ఆసుపత్రిని పరిశిలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుగురు వైద్యులకు కేవలం ఒక్కరే ఉండడంతో ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. నెల రోజులు ల్యాబ్ టెక్నిషియన్ లేకపోవడంతో ప్రవేటు ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు.

ఏవోకు సన్మానం

ఆసిఫాబాద్: మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వర్తించి, కరీంనగర్ జిల్లాకు బదిలీ అయిన ఏవో ఖాదర్ హుస్సేన్, కొత్తగా వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించిన మిలింగ్‌కుమార్‌లను శనివారం జిల్లా కేంద్రంలోని రాజంపేట రైతువేదికలో ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఫర్టిలైజర్స్ వ్యాపారులు కాచం నాందేవ్, తాటిపెల్లి గిరీశ్, ఆశిశ్, ఖాలీద్, సతీశ్, ఏఈవోలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తిర్యాణి: రెండు రోజుల పాటు ఈదురుగాలులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున మండలవాసులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ అన్నారు. వాగులు, వంతెనపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించినప్పుడు దాటవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు 73826 65681 ఫోన్ చేయాలన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

కౌటాల: మండలంలోని తలోడి గ్రామానికి చెందిన బిట్టుపల్లి గంగయ్యకు చెందిన గేదె శనివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. ఉద యం మేతకు వెళ్లినప్పుడు విద్యుత్ స్తంభానికి తగలడంతో అక్కడిక్కడే మృతి చెందిందిందన్నారు. గేదె విలువ రూ. 80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ఓటరు జాబితా పనులు పూర్తి చేయాలి

సిర్పూర్(టి): మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో కాగజ్‌నగర్ విభాగ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్డు



దహెగాం మండలంలోని కర్జి నుంచి రాంపూర్ వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. దీంతో రాంపూర్, మొట్లగూడ, దిగిడ గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు కోతకు గురవడంతో మొట్లగూడ ఆర్టీసీ బస్సును నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు

పొలాల పండుగకు సెలవు ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తిర్యాణి: పొలాల అమావాస్య పండుగకు సెలవు ప్రకటించాలన్నారు. శనివారం ఎంఈవో కార్యాలయ సిబ్బందికి తుడుందెబ్బ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయలకు ప్రతికంగా నిలిచే పొలాల పండుగ రోజు పాఠశాలలను నడిపించడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు వెడ్మ భగవంత్‌రావు, గేడం సుభాశ్, తొడసం భాస్కర్ పాల్గొన్నారు.

కేజీబీవీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

- పిల్లలను పొలాల పండుగకు పంపాలని డిమాండ్
- ఎస్‌వో బదిలీ నిలిపివేయాలని విద్యార్థినుల ధర్నా



కేజీబీవీ ఎదుట బైఠాయించిన తల్లిదండ్రులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మోడి కేజీబీవీ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేపట్టారు. పొలాల పండుగకు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులను లోనికి రానివ్వలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేజీబీవీ గేటు ఎదుట బైఠాయించినా.. ఎస్‌వో స్పందించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. జిల్లాలోని అన్ని కేజీబీవీల్లో ఉన్న పిల్లలకు పొలాల పండుగకు ఇళ్లకు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారని, ఇక్కడ మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సాక్షి ఇంచార్జీ సీఆర్టీని సంప్రదించడంతో తల్లిదండ్రుల ద్వారా ఇష్ట పూర్వకంగా తమ పిల్లలను తీసుకెళ్తున్నట్లు రాయించి పంపించామని తెలిపారు.

బదిలీ చేయొద్దు..

ఎస్‌వో మీనా కుమారిని బదిలీని నిలిపివేయాలని కేబీబీవీ విద్యార్థినులు మోడి గ్రామ ప్రధాన రోడ్డుపై శనివారం బైఠాయించారు. దీంతో ఎస్‌వో వచ్చి విద్యార్థినులను సముదాయించారు. తాను సమావేశానికి వెళ్తున్నానని, ప్రస్తుతం ఎక్కడికి వెళ్లడం లేదని చెప్పడంతో విద్యార్థినులు శాంతించారు. ఎస్సై గుంపుల విజయ్ వచ్చి విద్యార్థినులకు నచ్చజెప్పారు.

కరెంట్ లేక రోగుల ఇబ్బందులు

- ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీపీఎం, బీజేపీ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పేరుకే పెద్దాసుపత్రి. కరెంటు పోయిందంటే చాలు రోగుల బాధలు వర్ణణాతీతం. శనివారం జిల్లా కేంద్రంలో సాయంత్రం కురిసిన వర్షానికి కరెంటు పోవడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. సుమారుగా మూడు గంటల పాటు కరెంటు పోవడంతో సీపీఎం, బీజేపీ నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకొని రోగులు, రోగుల కుటుంసభ్యులతో కలిసి నిరసన తెలిపారు. కలెక్టర్, సూపరింటెండెంట్ స్పందించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకొన్న ఆసుపత్రి సిబ్బంది 2 లీటర్ల డిజిల్‌తో జనరేటర్‌ను ఆన్‌చేసి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆసుపత్రికి చేరుకొన్న డీఎంహెచ్‌వోకు సమస్యను వివరించారు. రోగులకు ఎలాంటి ఇబ్బదులు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సభ్యులు రాజేందర్, కార్తీక్, జయరాం పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

తిర్యాణి: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై మాధవ్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో పాఠశాల క్రీడా సమైఖ్య ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14, 17 వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎస్సై పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉమ్మడి జిల్లాలో నిర్వహించే జోనల్‌స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖ క్రీ డాల అధికారి మీనారెడ్డి, పీడీ గుండం లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు శంకర్, నరేందర్ పాల్గొన్నారు.

కూలిన ఇల్లు



పరిశీలిస్తున్న ఎస్సై మాధవ్‌గౌడ్

తిర్యాణి: మండలంలోని కోయతలండి గ్రామానికి చెందిన ఆత్రం గోపాల్ అనే వ్యక్తి కి చెందిన ఇల్లు శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలకు కూలింది. రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనూ ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్ గౌడ్ శనివారం సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబసభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

చేతిపంపునకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేసిన చేతిపంపు

కౌటాల: మండలం గురుడుపేటలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలోని చేతి పంపుకు అధికారులు శనివారం మరమ్మతు చేశారు. 'సాక్షి' దిన పత్రికలో శనివారం ప్రచురితమైన ' తాగునీటికి తండ్లాట' కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. చేతిపంపునకు మరమ్మతులు చేసి విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీర్చారు. గత కొద్ది రోజులుగా చేతిపంపు చెడిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. పంచాయతీ కార్యదర్శి సునీతకు 'సాక్షి' పత్రికకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మురుగు నీరు తొలగింపు



మురుగు నీటిని తొలగిస్తున్న సిబ్బంది

దహెగాం: గత నెల 26న సాక్షిలో స్వచ్ఛతకు స్వస్తి! అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రధాన రహదారి పక్కన మురుగు నీరు నిల్వ ఉండడంతో పంచాయతీ అధికా రులు జేసీబీ సహాయంతో తొలగించారు. ప్రస్తుతం మురుగు నీరు వెళ్లేందుకు కాలువ తీయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా డ్రెయినేజీల్లో పూడిక తీయించారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.